# చెమ్మ

కథ

లక్ష్మీనారాయణ

ఆ పరిచయానికిప్పుడు
మూడు పుష్కరాల వయసు!
పెదవులపై మెరసిన లాస్యరేక!
కనకాంబరానికి సైతం సొబగులద్దే
ఆ సముఖం!
'విన్నపాలు వినవలె వింతవింతలూ', గాలిలోంచి
వినవస్తున్న సన్నజాజి తెమ్మెరలా
అనగలరాగమై అలనల్లన మనసంతా అలుముకుంటున్నట్లుగా...
వినీలాకాశంలో పరచుకున్న తెలి మబ్బుతునకల్లా
కళ్ళ లోయల్లోని ఆకుపచ్చ కాన్వాసు చిత్రరహితంగా...
వర్ణ సమ్మిశ్రితమైన తూరుపు పళ్ళెంలో సూర్య తూలిక నిమీలితంగా...
నిలువనీయని అంతశ్చింతనల అలుపెరుగని గగుర్పాటు
ప్రవహించే అంతర్వాహిని ఆకాశదేశాన రాయంచల సవ్వడి,
పలుకే బంగారమయిన మునిపంటి మెరపు విరుపు

** ** **

ఉదయాన్నే ఫోన్... 'కన్నమ్మ'

'సముఖం ప్రసాదించమని' అభ్యర్థన

"అలాగే... దానికేం భాగ్యం, రెండేళ్ళయిందనుకుంటా మనం కలసి... ఆదివారం వుదయానికి వాలిపోనా..." అల్లరిగా

"వద్దొద్దు... అసలే జన ప్రవాహం... ఆరోజు మరీ ఎక్కువ... నువ్వు ఎక్కడైనా తప్పిపోవచ్చు కూడానూ... ఆ మర్నాడయితే బాగుంటుంది" చిన్నగా వేడుకోలు


"శుభం భుయాత్"- డన్...

'కన్నమ్మ' అసలు పేరు కాదు, యింటిపేరేమోకానీ... నరశింహమూర్తి- కెఎన్నెమ్'- వాడుకలో 'కన్నమ్మ' అయింది. నిజంగా కన్నమ్మలానే మమ్మల్ని సాకేవాడు. పుస్తకాన్ని పరిచయం చేసింది వాడే!

** ** **

నాకైతే ఏబాదరబందీ లేదు. వున్న ఒక్కమ్మాయి బెంగుళూరుల నివాసం అల్లుడితో కలసి... డాక్టర్లే యిద్దరూనూ.

సంవత్సరం దాటింది సావిత్రి నన్నొంటిరిని చేసి వెళ్ళిపోయి. రేపొచ్చే ఉగాదికి ముందురోజే... ఉద్యోగ విరమణ... అనంతరం



ఏమో!

ఫ్లాస్క్‌లోని కాఫీని కప్‌లో పోసుకుని హిందూ పేపర్ తీసాను. అన్న మాటేకానీ ఏ పనీ చేయ మనసవటంలేదు. ఏదో...

ఆలోచన... ఒకింత లోతుగా... మరింత వీలుగా... యింకా మనసును పీడని మార్మికత... 'హిపోక్రసీ' అంటాడు గోపీ... సవ్వడెరుగని జ్ఞాపకాల దొంతర... దొంతరగా.

** ** **

ఆ పరిచయం కల్యాణి సంగీతం మాస్టారుగారి పెద్దమ్మాయి అయినా... కల్యాణికి సంగీతం రాదు.

కల్యాణికి వీణ రాదు

కానీ... కల్యాణి కళ్ళల్లో కోటిరాగాలు అవలీలగా పలుకుతాయి.

కల్యాణి నడకల్లో సంగీత సరస్వతి కొత్త గమకాలు నేర్చుకుంటుంది. అసలు కల్యాణి తలక్రిందులుగా నిలబెట్టిన వీణలా వుంటుంది.

చక్కని సిరితల... చిక్కటి తలకట్టు నడుముమీంచి జారి వయ్యారాలొలుకుతూ జడకుచ్చెలు... జడగంటలందామా...

అడుగు... అడుగులో 'సంగతు'లు పలికే స్వరగతులు.

వెరసీ నిలువెత్త మోహనరాగమే! ఆ రాత్రి నన్నూ, జ్ఞాపకాలనూ మోసుకుంటూ గమ్యంకేసి... రైలు పరుగు. జారిపోతున్న కాలంతో పాటుగా మనసంతా ఒడ్డున పడ్డ చేపలా గిలగిల్లాడుతోంది. ఎందుకని... ఏమిటా ఆరాటం... అలజడిగా వుందేమిటని...

నిర్లిప్తంగా పరుగెడుతున్న రైలు వొంటరిగా నేనొక్కణ్ణే. జ్ఞాపకం 'మొగలి' పొద తేనెతుట్టెలా కదలినప్పుడల్లా మెత్తగా వొత్తుకుంటున్నట్లు... కలలు లేవు... నిద్రపోవడం లేదు. కాబట్టి... కన్నీళ్ళు రావు. గుండెకింది చెలమ ఎండిపోయింది కనుక....

** ** **

వాతావరణమంతా చలచల్లగా వుంది. స్టేషన్ బయట కోలాహలం, జనప్రవాహం పుష్కరాల రోజులాయె. గోదావరిపుష్కరాలు. ప్రవాహంలాంటి జ్ఞాపకాలు ఎన్నని.... ఎన్నెన్నెని... కాలువ స్నానాల చన్నీటి పులకరింతలు.


'కన్నమ్మ' పలుచగా నవ్వుతూ... ఆపై అలుపెరుగని... విరామమెరగని ముడివిప్పిన ప్రవాహం...

కర్తవ్య నిర్వహణకెడుతూ... 'రేపైతే నేను ఫ్రీ.... ఈరోజు నువ్వు 'బతుకు'... కారుంది... డ్రైవరు కావాలంటే వుంటాడు లేదా నువ్వే వెళ్ళొచ్చు. రాత్రికి భోజనం సమక్షంలో... ఫరవాలేదు మనవాడే! నిష్క్రమణ... విరామం.

** ** **

ఎక్కడో చూసినట్లున్న మొహం! సాంబం కోరిక మీద వాడి కంపెనీలో జరుగుతూన్న రిక్రూట్‌మెంట్లకు నేనొక మెంబర్.

యింటర్వ్యూకొచ్చిన పాతికమంది కుర్రాళ్ళలో... "అభినవ్"!



పేరుకు తగ్గట్లుగా అతని మొహం! ఎలా... ఎక్కడ... తెలుసు... ఖచ్చితంగా తెలుసనిపించేలాంటి ప్రవర్తన...ఏది ఏమైనా అభినవ్‌కి ఉద్యోగం వచ్చింది.

** **

'నాదం' కన్నమ్మ కారు డ్రైవర్. సాత్వికుడే. అదే అడిగాను. నాదమంటే ఏ నాదమని.

ఏ వీణానాదమో...రణ నినాదమో అంటాడనుకుంటూ..

కానీ నాదం అసలు పేరు మదన్. ఇంగ్లీషులో రాసి తిరగేసినప్పుడు అలా వాడుకలో నాదం అయ్యాడు. అతని సృజనాత్మకతకు జోహార్లు. కబుర్ల పోగే. ఏదేదో చెబుతున్నాడు. నేను వింటున్నానో లేదో కూడా పట్టించుకోకుండా, తన ధోరణిలో తానుగా...

రాత్రి కన్నమ్మతో, నేను స్నానం చేసి వచ్చేలోగానే మేం తిరిగిన ఊళ్ళన్నింటినీ నివేదించాడు. 'నాదం' స్వామి భక్త పరాయణుడు.

** ** **

కొవ్వూరు దగ్గర స్నానాదులతోసహా కార్యక్రమాలు ముగించుకునేసరికి మూడయ్యింది. అక్కణ్ణుంచి నడుస్తుండగా,

'అలా పోయొద్దామా' నా మనసు చదివినట్లుగా అన్నాడు కన్నమ్మ.

అదే వాడిలో నాకు నచ్చేది యిప్పటికీనూ. కన్నతల్లికి కూడా తెలియని బిడ్డల మనసు. యీ కన్నమ్మకు తన మిత్రుల గురించి తెలుసు. అన్యమనస్కంగానే తలూపాను.

"అవును. అప్పుడు కూడా యిలాగే పుష్కరాలు కదా..." జ్ఞాపకాలు ముప్పిరికొనగా... కన్నమ్మ కార్లో కూర్చుంటూ 'నాదం'కు చెప్పాడు వెళ్ళవలసిన ప్రాంతం గురించి.

ముప్ఫైఎనిమిదేళ్ళ పరిచయం యింకా పచ్చిగా గుండెల్లో నిన్నమొన్న జరిగినట్లుగా...

ఊరి బయటే కారాపాడు నాదం "యింక ముందుకుపోవడం కష్టమంటూ" అది స్వగతమో... స్టేట్‌మెంటో తెలీకుండా... అంతా జనం... జనంతో రోడ్లు... ఆ జన ప్రవాహంలో యీదుకుంటూ నేనూ... కన్నమ్మా...

మెయిన్ రోడ్డు దిగి, కాలువ గట్టుమీంచి మూడు నాలుగు కిలోమీటర్లు దూరం నడక అప్పటికి జనం తగ్గి కాస్త రోడ్డేదో మట్టేదో తెలుస్తోంది.

మెయిన్ రోడ్డు దిగి, కాలువ గట్టుమీంచి మూడు నాలుగు కిలోమీటర్లు దూరం నడక అప్పటికి జనం తగ్గి కాస్త రోడ్డేదో మట్టేదో తెలుస్తోంది.

అక్కడికి పదారడుగుల దూరం వుందనగా, హాస్పటల్ గేటు దగ్గర ఎవరి కోసమో ఎదురు చూస్తూ... ఆ యువకుడు... అభినవ్!

నన్ను చూడగానే ఎదురొచ్చి... "అమ్మ చెప్పింది మీరొస్తారని" కళ్ళల్లో అమ్మకిచ్చిన మాట నెరవేర్చుతున్నానన్నట్లుగా గొప్ప సంతృప్తి వెలుగుతూండగా...

"అమ్మ"

"అవునండి... అమ్మే... కల్యాణి"!

అందాకా బలవంతంగా నిగ్రహించుకున్నట్లుగా ఒక్కసారిగా చేతుల్లో మొహం దాచుకుని... అభినవ్.

"రాత్రి... అమ్మ వెళ్ళిపోయింది. తట్టుకోలేని ఉద్వేగపు అలజడి... అమ్మను పట్టుకెళ్ళిపోయింది"

అప్పుడర్థమయింది. ఎక్కడో తెలిసినట్లున్నదనుకుంటున్న అభినవ్ మొహం కల్యాణి పోలికలతో వుండటంవలన అని.

నాలో యీ అశాంతికి అర్థం కూడా తెలిసింది. ఏంలాభం. అంతా అయిపోయింది, ఆఖరి చూపుకు కూడా నోచుకోలేని 'పేద'ను చేసి... కల్యాణి.

అభినవ్‌ని సముదాయిస్తోంటే, చేతుల్లో వణుకు.

"నాకు పదేళ్ళున్నప్పుడే నాన్న పోయారు. అప్పట్నించీ అమ్మేఅన్నీ అయి నన్ను పెంచింది.

కిందటి పుష్కరాలకు కూడా నన్ను తీసుకుని అమ్మ వచ్చింది. అప్పుడు నేను చిన్నవాణ్ణి కదా... అన్నాడు అభినవ్.

దారులు వేరయినా గమ్యమొకటే అనిపించింది. అభినవ్ మాట్లాడుతూంటే కల్యాణి మాట్లాడుతున్నట్లుగానే అనిపిస్తోంది.

భారంగా వెనుదిరిగిన కొంతసేపటికి... భుజంపై చల్లని స్పర్శ.... కన్నమ్మ.

కళ్ళల్లో అలుముకున్న ఉద్వేగపు యవనిక... మనకబారిన మనసుకు స్వాంతన... ఊరట... కన్నమ్మ స్పర్శలోనే మౌన సంభాషణ యిప్పుడిక నేను 'పేద'ను మాత్రమేకాదు 'ఒంటరి'ని కూడా యీ ప్రపంచంలో అనిపించింది. ప్రవహించే గోదావరి అలలు లేని మౌనాలాపన... రాగాల రాదారుల్లో... కన్నీటి చెలమలను కలుపుకుంటూ... వడిగా... వడివడిగా... ముందుకు... మునుముందుకు... అనంతంగా.

# అతను

అతని భార్య - అతని ప్రేయసి
అతని భార్య చనిపోయింది
'నీకు కొత్త భార్యను ఇస్తాను'
అంది ధరిత్రి
'వద్దు అసలే వద్దు
నా భార్యను నాకు ఇవ్వు
అదే భార్యను అవే లక్షణాలతో'
గట్టిగా అరిచాడతను

అతని భార్య పోయి
ప్రేయసి వచ్చింది
ప్రేయసి కూడా చనిపోయింది
'నీకు కొత్త ప్రేయసిని
ఇంకా అందమైన ప్రేయసిని
ఇస్తాను' అంది ఆకాశం
'వద్దు అసలే వద్దు
నా ప్రేయసిని నాకు ఇవ్వు
అదే ప్రేయసిని అవే లక్షణాలతో'
మళ్ళీ అరిచాడతను

అతనొక్కడే
అతనూ చనిపోయాడు
'నిన్ను బతికిస్తాం
ఇంకా అందంగా' ఆకాశమూ, ధరిత్రీ
రెండూ అరిచాయి.

'వద్దు అసలే వద్దు
మీరు బతికించినా
నేను రాను అవే లక్షణాలతో'
బిగ్గరగా అరిచాడు

'నేను బతికినా
ఆ ప్రేయసి లాంటి భార్య
ఆ ప్రేయసీ నా లాంటి నేనూ
కన్పిస్తారా?
అనునిత్యం పరిమళించే
ఆ ప్రేమ పుష్పాలు వికసిస్తాయా?
ఆ కాలం తిరిగి వస్తుందా?
రాదు
మరెందుకు బతికించడం
ఎక్కడైనా
కొసప్రాణం వుంటే చంపెయ్యండి'
గట్టిగా అరిచాడతను.

– జింబో